# రాధమ్మ గారింట్లో రథసప్తమి

అయ్యలసోమయాజుల ప్రసాద్



రాజమండ్రిలో దానవాయి పేటలో ఉన్న రాధమ్మ గారిని తెలియని వారుండరు. సుమారు అరవై ఏళ్ళ క్రిందటి మాట. రాధమ్మ మా నాన్నగారికి స్వయాన అక్క. నాన్న సుబ్బయ్య కన్నా పదేండ్లు పెద్దది.

తాతయ్య నానమ్మ నాన్న చిన్నప్పుడే అందనిలోకాలకు వెళితే తానే నాన్నని కంటికి రెప్పలా భర్త దివాకరం స్వయాన మేనమామ సహాయంతో పెంచింది.

రాధత్త దంపతులకు పిల్లలు లేకపోతే ఇరుగు పొరుగు పెంచుకోమంటే ఎందుకు నా తమ్ముడు వీరభద్రం నాకు కొడుకు వరప్రసాదిలా వాడు చాలు అనేదిట.

భర్త అధ్యాపకునిగా పురపాలక సంఘంలో చేస్తు అర్థాంతరంగా శ్రీరాముని దరిచేరినా అప్పుడు నాన్నని ఇంటర్మీడియట్ తో చదువు ఆపక కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలలో చదివించింది .

నాన్నకు రాజమండ్రిలో ఇంజనీరింగ్ వస్తే సంతోష పడిన మొదటి వ్యక్తి రాధమ్మ. సనాతన సంప్రదాయాలను పాటించి నాన్నకు దూరపు బంధువుల అమ్మాయి సుశీలను పెండ్లి చేసింది నేను, చెల్లి పద్మ పుట్టాక మా బాగోగులు అన్నీ తానే చూసేది

అన్ని భాగ్యాలలో ఆరోగ్యం అతి ముఖ్యమని "ఆరోగ్యం భాస్కరాధిత్యేత్" అని మాఘమాసంలో వచ్చే నాలుగు ఆదివారాలు ఉపవాసం ఉండి పాలు పొంగించి చప్పిడి పులుపు, కారం లేక ఒక్క పెరుగు అన్నం తినేది.

ఎందుకు ఇలా తింటున్నావంటె మీరంతా బాగుండాలని అనేది.

ఇక ఆదిత్యుని పుట్టిన రోజైన రథ సప్తమి నాడు రాధత్త చేసే హడావిడి అంతా ఇంతా కాదు.

ముందు రోజు తానే మా ఇద్దరిని తీసుకెళ్ళి జిల్లేడు ఆకులు, రేగుపళ్ళ ను కొని తెల్లవారుజామున పెరట్లో బావి దగ్గర తలపై జిల్లేడు



ఆకు, రేగు పళ్ళు పెట్టి స్నానం చేయించడం. ఆతరువాత అమ్మని కుంపటిని ఇమ్మని తానే కడిగి పెరట్లో ఉన్న గోమాత లక్ష్మమ్మ పిడకలతో పెరట్లో తులసిమొక్క ముందు అనాదిగా వస్తున్న ఇత్తడి గిన్నె లో కొత్తబియ్యం, ఆవుపాలు పొంగిస్తు సూర్యాష్టకం, ఆదిత్య హృదయం చెబుతు మాకు పొత్తి మడిలాగుల నిచ్చి సూర్యాష్టకం చదవండర్రా సూర్యోపాసన ఆరోగ్యకరం.

ప్రత్యక్ష దైవం సూర్యుడని ఎర్ర అక్షింతలు, మందారపువ్వులుతో పూజ చేసి చిక్కుడు కాయలకు పుల్లలు గుచ్చి సూర్య రథం చూసారా అని చిక్కుడు ఆకులలో పరమాన్నం పెట్టి సూర్యునికి నివేదించి చెప్పండర్రా సూర్యాష్టకం స్పష్టంగా అంటే నేను చెల్లి

" ఆదిదేవ నమస్తుభ్యం ప్రసీద మమభాస్కరా

దివాకర నమస్తుభ్యం ప్రభాకరా నమోస్తుతే" అనిపూర్తిగా చెప్పిన వెంటనే చిక్కుడు ఆకులలో ఇచ్చిన రాధత్త బెల్లం పరమాన్నం అమృతం కన్నా ఎక్కువే. అని ఏడు పదుల వయస్సులో ఆరవై ఏళ్ళ జ్ఞాపకాలను దేశం కాని దేశం అమెరికాలో ఆరవ అంతస్తులో కూర్చుని మనుమలతో చెబితే తాతయ్య మరి నానమ్మ స్టవ్ మీద చేసి కళ్ళ కద్దుకుని పరమాన్నం తినండి.

ఈ రోజు సన్ పుట్టిన రోజు అంది సన్, మూన్ లకి పుట్టినరోజులుంటాయ తాతయ్య క్లారిఫై మై డౌట్ అంటు పదేళ్ల పింకీ అడిగితే అరవై ఏళ్ళు దాటిన మా ఇంటావిడ ఎందుకుండవు తాతయ్య ప్రొఫెసర్ ఆయనికి అన్నీ తెలుసు అని నా వైపు చూడటం వెంటనే రాధత్త చెప్పింది కొన్నాళ్ళకు ఈ సంప్రదాయం, సంస్కృతిల రక్షణ మీదే మరుగున పడకుండా చూడండి అన్నది జ్ఞాపకం వచ్చి న్యాయం చేస్తున్నామా అని మనసులోనే అనుకున్నాను...!!

***

